సాక్షి
వరంగల్
శనివారం | 13 | జూలై | 2024



ఏడు దీవుల లక్నవరం

గోవిందరావుపేలోని లక్నవరం సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో పనులు కొనసాగుతున్నాయి. - 8లో▸



అండగా ఉంటాం..

తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$29^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం సమయంలో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన మార్నేని



కాశోజీ సెంటర్: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సత్య శారదాదేవిని కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నీట్‌ను రద్దు చేయాలి

కాశోజీ సెంటర్: కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రైవేట్, పెట్టుబడిదారులు, లీకేజీ స్వాములకు అప్పగించి నాశనం చేస్తోందని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు కలెక్టర్ సత్య శారదాదేవిని కలిసి నీట్‌ను రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, రంజిత్, కరుణాకర్, హరిబాబు, వీరన్న, ఏఐకేఎంఎస్ నాయకులు రాజర్ల బాలరాజు ఉన్నారు.

చికిత్స కోసం వచ్చి వృద్ధురాలి మృతి

నర్సంపేట రూరల్ : చికిత్స కోసం వచ్చిన ఓ వృద్ధురాలు బీపీ, గుండెపోటుతో మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని వృద్ధురాలి బంధువులు ఆందోళన చేసిన సంఘటన నర్సంపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామానికి చెందిన బాషబోయిన ఓదెమ్మ (76) మోకాళ్ల నొప్పులు రావడంతో నర్సంపేట నెక్కొండ రోడ్డులోని ఓ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం తీసుకొచ్చారు. ఆస్పత్రిలో వైద్యులు ఓదెమ్మను అడ్మిట్ చేసుకుని ఇంజక్షన్ ఇచ్చి, సెలైన్ బాటిళ్లు పెట్టారు. ఈలోగా సాయంత్రం ఒక్కసారిగా బీపీ పెరిగి, గుండెపోటు రావడంతో వరంగల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు అంబులెన్స్ మాట్లాడుకుని రాగానే వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే ఓదెమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సై ప్రవీణ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులకు నచ్చజెప్పి వైద్యులతో మాట్లాడించారు. ఈ విషయమై డాక్టర్ అమృతారెడ్డిని వివరణ కోరణగా ఓదెమ్మ బీపీ పెరిగి, గుండెపోటు రావడంతో సీపీఆర్ చేశాం. అయినా నొప్పి తగ్గకపోవడంతో వరంగల్‌కు త్వరగా వెళ్లాలని సూచించాం. ఆమెకు వైద్యం చేయడంలో ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించలేదు. నర్సంపేట సీఐ రమణమూర్తిని వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అందిన వెంటనే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

గాయపడిన యువకుడు..

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలికి చెందిన మంద రాజబాబు (27) ఈ నెల 4న రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెయింటర్‌గా పనిచేస్తున్న ఆయన పనిపై వరంగల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి పడిపోయి గాయపడ్డాడు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శుక్రవారం ఆయన తల్లి సాంబ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఎస్సై జానీపాషా తెలిపారు.

ఆఖరి మజిలీకి అన్నీ సమస్యలే..



సంగెం: ఆఖరి మజిలీలో అన్ని సమస్యలేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని మొండ్రాయిలో శ్మశానవాటిక నిర్మించినా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన ఏడాకుల లింగమూర్తి మృతి చెందగా గురువారం రాత్రి దహన సంస్కారాలు నిర్వహించారు. శ్మశానవాటికకు సీసీ రోడ్డు లేదు.. దారి మొత్తం బురదమయంగా మారింది. వీధి లైట్లు లేకపోవడంతో అంధకారం నెలకొంది. ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించారు. పైపులైన్ ఉన్నప్పటికీ జీపీ సిబ్బంది గేట్‌వాల్వ్ తిప్పకపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. దీంతో దూరంగా ఉన్న వ్యవసాయబావి వద్ద నుంచి క్యాన్లు, బకెట్లతో నీరు తీసుకొచ్చి సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో అంత్యక్రియలు నిర్వహించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానవాటికలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎదురు చూపులు

రైతు భరోసా కోసం కౌలు రైతుల నిరీక్షణ

- ఎన్నికల హామీ మేరకు రూ.15 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి
- అభిప్రాయాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- జిల్లాలో 19 వేల మంది కౌలు రైతులు



చెన్నారావుపేట: వారు నిరుపేదలు.. వ్యవసాయ భూములను కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తారు. వ్యవసాయం తప్ప వేరే పనులు చేసుకోలేరు. కానీ, పంటలు సాగు చేస్తున్న ఈ కౌలు రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి కష్టాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. కౌలు రైతులను ఆదుకుంటామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వీరికి ఎలా సాయం అందించాలనే అంశంపై అభిప్రాయ సేకరణ చేపట్టింది. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని 30 శాతం మంది అభిప్రాయాలను వెల్లడించినట్లు తెలిసింది. తాజాగా రైతు భరోసా అమలుపై అధ్యయనం చేస్తున్న మంత్రివర్గ ఉప సంఘం కౌలు రైతులు ఏం కోరుకుంటున్నారో ఆరా తీస్తోంది. వరంగల్‌లో ఇటీవల జరిగిన మంత్రివర్గ ఉప సంఘం భేటీలో కౌలు రైతులకు ప్రయోజనం కలిగేలా నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. రైతు భరోసా అందిస్తారా.. గుర్తింపు కార్డులు జారీచేసి మరో రూపంలో సాయం అందిస్తారా తేలాల్సి ఉంది..

గుర్తించిన వైఎస్సార్..

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కౌలు రైతులకు అండగా నిలిచారు. 2008–09లో కౌలు రైతులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పుడు ఉమ్మడి జిల్లాలో కౌలు రైతులు తక్కువ మంది ఉండేవారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కౌలు రైతుల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. అప్పటి ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసింది. అంతే కాకుండా కౌలుదారు చట్టాన్ని తీసుకొచ్చి ఆర్‌ఓఆర్ (రైట్ ఆఫ్ రికార్డ్స్) ప్రకారం పంట రుణాలు సైతం అందజేసింది. కౌలు రైతులు పండించే ధాన్యమే గ్యారంటీగా రుణాలిచ్చింది. అలాగే, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఇచ్చే పహణీ నకళ్లు ఆధారంగా వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు సైతం అందజేశారు.

ఎత్తివేసిన రాయితీ..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో కౌలుదారులకు కష్టాలు మొదలయ్యాయి. అంతకుముందు ఫలానా రైతు పొలాన్ని సదరు వ్యక్తికి కౌలుకు ఇచ్చారని వీఆర్వోలు, వీఆర్‌ఏలు ధ్రువీకరణ పత్రం రాసిస్తే పరికరాలు, విత్తనాలు సబ్సిడీపై ఇచ్చేవారు. 2016–17 సంవత్సరం వరకు కౌలు రైతులకు కొనసాగిన సబ్సిడీలను ఆ తర్వాత ఎత్తివేశారు. 2020 సంవత్సరం తర్వాత నుంచి సాధారణ రైతులకు సైతం విత్తనాల రాయితీని అందించడం లేదు. పచ్చిరొట్ట విత్తనాలకు మినహా మిగిలిన వాటికి సబ్సిడీ ఇవ్వడం లేదు. 2020 సంవత్సరానికి ముందు కిలో వరి విత్తనాలకు రూ.5 నుంచి రూ.10 వరకు, అపరాలకు 40 నుంచి 50 శాతం రాయితీ అందించేవారు.

జిల్లాలో వ్యవసాయ భూములు, రైతులు, గ్రామాల వివరాలు..
వ్యవసాయ భూములు : 3,35,312 ఎకరాలు
రెవెన్యూ గ్రామాలు : 191
గ్రామ పంచాయతీలు : 323
మండలాలు : 13
ఏఈఓ క్లస్టర్లు : 59
మొత్తం రైతులు: 1,76,000 మంది
సన్నకారు రైతులు : 1,39,837 మంది
చిన్నకారు రైతులు : 26,516 మంది
కౌలు రైతులు : 19 వేల మంది

ఎన్నికల హామీ..

జిల్లాలో 1.76 లక్షల మంది రైతులు రైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో చిన్న రైతులు 26, 516, సన్నకారు రైతులు 1,38, 837 మంది ఉన్నారు. కౌలు రైతులు సుమారు 19 వేల మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందటం లేదు. సంవత్సరాలుగా భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేయడమే తప్ప ఎలాంటి హక్కులు, రాయితీలు దక్కడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైతం పరిహారం అందడం లేదు. రైతు భరోసా కూడా రావడం లేదు. కౌలు రైతులను ఆదుకుంటామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో తమకు ప్రయోజనం కలుగుతుందని కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు.

విధివిధానాలు ఖరారు..

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.15 వేల చొప్పున రైతు భరోసా అందించాలని నిర్ణయించి విధివిధానాలు ఖరారు చేసినట్లు సమాచారం. అభిప్రాయ సేకరణ కోసం ఇటీవల సమావేశాలు ఏర్పాటు చేశారు. దీంతో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పంట రుణాలు, సబ్సిడీలు అందాయని వెల్లడించిన కౌలు రైతులు తమను ఆదుకోవాలని కోరారు. అలాగే, రైతు సంఘాల నాయకులు సైతం కౌలు రైతులకు రైతు భరోసా అందించాలని, సబ్సిడీలు, పంట రుణాలు ఇవ్వాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వం కూడా ఆలోచన చేస్తుండటంతో కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ చర్చలో తమకు లబ్ధి జరిగేలా ప్రతిపాదనలు చేస్తారని కౌలు రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

మాకు భరోసా కల్పించాలి..



నేను 8 సంవత్సరాలుగా భూమి కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నా. కాలమైనా, కాకున్నా పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్నా. పంట పండినా, పండకుండా కౌలు కట్టాల్సిందే. ప్రస్తుతం 5 ఎకరాల వరకు కౌలు చేస్తున్నా. ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించి రైతు భరోసాతోపాటు సబ్సిడీ విత్తనాలు, యంత్రాలు అందించాలి.

- కేశబోయిన వెంకన్న, కౌలు రైతు, అక్కల్‌చెడ

కౌలు రైతులను గుర్తించాలి..



ఎన్నికల్లో ఇచ్చిన హామీ గుర్తుపెట్టుకుని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు అందించాలి. 11 సంవత్సరాలుగా కౌలునే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న. 6 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నా. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కౌలు రైతులను గుర్తించిండు. ఈ ప్రభుత్వం కూడా కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా అందించాలి.

- జిడ్డి బాబు, కౌలు రైతు, చెన్నారావుపేట

కష్టాలు తొలగుతాయి..



ప్రభుత్వం రైతు భరోసా అందిస్తే కౌలు రైతులకు ఊరట లభిస్తుంది. కౌలు రైతులు పంట పండించి కౌలు చెల్లించి, పెట్టుబడులు రాక వ్యవసాయం చేయడం మానేసే అవకాశాలు ఉన్నాయి. కూలి గిడితే సరిపోతుందని వ్యవసాయం చేస్తున్నారు. ప్రభుత్వం హామీని నెరవేర్చి భరోసా కల్పించి వారిని ఆదుకోవాలి.

- ఇసంపల్లి బాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి

- అవగాహన సదస్సులో కలెక్టర్ సత్య శారదాదేవి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

కాశోజీ సెంటర్: ఇందిరా మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి సూచించారు. సెర్ప్, స్త్రీనిధి సిబ్బందికి మహిళా శక్తి పథకంపై కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు దిశానిర్దేశం చేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే పథకం ఉద్దేశమని పేర్కొన్నారు. పలు సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహిళలు వ్యాపారం ప్రారంభించే ముందు తమ వద్ద ఉత్పత్తి అయ్యే వస్తువుల మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిమాండ్ ప్రతిపాదన ఏర్పాటు చేస్తే ప్రయోజకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో 1,763 మందికి పలు సెక్టార్లలో జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేస్తోందని తెలిపారు. 14 యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలి రాజు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

- ఎస్‌ఎఫ్ నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

కాశోజీ సెంటర్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యాట ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ రావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఉన్మాదిని కఠినంగా శిక్షించాలి



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

చెన్నారావుపేట: మండలంలోని పదహారు చింతల్ తండాలో బానోత్ శ్రీను–సుగుణను నిద్రలోనే హత్యచేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్మాదికి ఉరిశిక్ష విధించి, కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ఆయన వెంట యాకూబ్, లక్ష్మణ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ మండల నాయకులు బోడ బద్దునాయక్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అండగా నిలిచి వైద్య సేవలు అందించారని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందించి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బానోత్ గణేశ్‌నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బోడ మురళీనాయక్ తదితరులు ఉన్నారు.

పాకాల ఆధునికీకరణకు ప్రణాళికలు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



సరస్సు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఖానాపురం: పాకాల సరస్సు ఆధునికీకరణకు ప్రత్యేక ప్రణాళికల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పాకా ల ఆయకట్టు కింద వరినారుమళ్ల కోసం శుక్రవారం నీటిని విడుదల చేసి చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడారు. ఆయకట్టు కాల్వలు, తూములను కూల్చకుండా లీకేజీల నివారణకు నివేదికలు తయారీ చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఏకో టూరిజంలో భాగంగా చెరువు పైనుంచి చిలుకలగుట్ట వరకు రోప్‌వే, చిలుకలగుట్టపై ఉన్న చెరువు, 100 ఎకరాల్లో రిసార్ట్స్ ఏర్పాటుకు నివేదికలు తయారీ చేయాలని ఇటీవల మంత్రి పొంగులేటి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రెస్టారెంట్లు అందుబాటులోకి తీసుకురావడానికి, బోటింగ్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అదేవిధంగా పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే దొంతి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఈఈ సాల్మన్‌రాజ్, డీఈ రమేశ్‌బాబు, డీసీసీ అధికారి ప్రతినిధి రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలగందుల రాజు, వీరమనేని సాగర్‌రావు, ముస్తఫా, చెడిపాక ఉపేందర్, ఏఈలు అనిత, స్నేహిత, స్వాతి, రమేశ్, నాయకులు వెంకటప్రసాదరావు, వల్లె శ్రీనివాస్, రాజిరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, బైరి మురళి పాల్గొన్నారు.

రెగ్యులర్ ఆర్డీఓ లేక ఇబ్బందులు

- డిజిటల్ సంతకం చేయక పేరుకుపోతున్న ఫైళ్లు
- పరిష్కారం కాని రైతుల భూసమస్యలు



వరంగల్ ఆర్డీఓ కార్యాలయం

కాశోజీ సెంటర్: వరంగల్‌కు రెగ్యులర్ ఆర్డీఓ లేక భూసమస్యలు పరిష్కారం కావడం లేదు. డిజిటల్ సంతకం లేక ఫైళ్లు పేరుకుపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం వివిధ మండలాల రైతులు తహసీల్దార్లకు అర్జీలు పెట్టుకుంటున్నారు. అర్జీలను పరిశీలించిన తహసీల్దార్లు ఫైళ్లను ఆర్డీఓకు పంపిస్తున్నారు. వరంగల్ ఆర్డీఓగా నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణికి అదనపు బాధ్యతలను అప్పగించడంతో పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు సంబంధించిన భూసమస్యలు, అర్జీలు గుట్టలుగా పేరుకుపోయిన విషయం విదితమే. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భూసమస్యలను పరిష్కరించాలని, ధరణిలో ఉన్న కొన్ని మాడ్యూళ్లను సవరించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును ఉపయోగించుకొని రైతులు తమ భూసమస్యల పరిష్కారం కోసం అర్జీలు పెట్టుకుంటున్నారు. అయితే, ఇటీవల ఆర్డీఓ అవినీతి ఆరోపణల కారణంగా ఏసీబీ అధికారులు అరెస్టు చేయగా నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణికి అదనపు బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో వరంగల్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సంతకం లేక ఫైళ్లు పేరుకుపోతున్నట్లు సమాచారం. కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేయగా సాంకేతిక కారణంతో డిజిటల్ సంతకం కావడం లేదని తెలుస్తోంది. ఒక్క అధికారికి ఉన్న ఆధార్ నంబర్ ప్రకారం ఏదో ఒకచోట మాత్రమే సంతకం అవుతోంది. ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించకపోవడంతో సంతకం కావడం లేదని తెలిసింది. ఈ విషయమై సీసీఎల్‌ఏ అధికారులకు లేఖ రాసినట్లు ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ) అబిద్ అలీ తెలిపారు. సీసీఎల్‌ఏ అధికారుల నుంచి అనుమతి రాగానే డిజిటల్ సంతకం స్కాన్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఆర్డీఓను నియమించి, డిజిటల్ సంతకంలో తలెత్తిన సాంకేతిక సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

సినిమా థియేటర్‌లో యువకుడికి కత్తిపోట్లు

- కూతురిని ప్రేమించాడని తండ్రి ఘాతుకం
- వర్ధన్నపేట పట్టణంలో ఘటన



కత్తిపోట్లకు గురైన విజయ్‌ని ఆస్పత్రికి తరలించేందుకు యత్నిస్తున్న యువకులు



సినిమా థియేటర్‌లో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య

రాయపర్తి(వర్ధన్నపేట): సినిమా థియేటర్‌లో యువకుడిపై కత్తితో దాడి జరిగింది. ఈ ఘటన వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని భారతీయ టాకీస్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కూతురిని ప్రేమించినందువల్లే ఆమె తండ్రి ఈ దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో బుడిగజంగాల వారు శుక్రవారం వనభోజనాలకు వెళ్లారు. సాయంత్రం ఎనిమిది మంది యువకులు భారతీయుడు–2 సినిమా చూసేందుకు వర్ధన్నపేటలోని భారతీయ టాకీస్‌లో ఫస్ట్ షోకు వచ్చారు. ఈ క్రమంలో సినిమా చూస్తుండగానే వెనక సీటులో ఉన్న ఊర కృష్ణ అనే వ్యక్తి ముందుసీటులో కూర్చున్న కల్లెం విజయ్‌ని వీపు పక్కన మూడు కత్తిపోట్లు పొడిచాడు. అతడు అరుపులతో వెనకకు తిరిగి చూడగా కడుపులో మరో రెండు పోట్లు పొడిచి పారిపోయాడు. సినిమా మోజులో ఉన్న జనం వెంటనే తేరుకొని ఘటనను చూసి థియేటర్ బయటకు పరుగులు తీశారు. విజయ్‌ని వెంటనే వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కూతురిని ప్రేమించాడని..

ఇల్లంద గ్రామానికి చెందిన ఊర కృష్ణ, రాజ్‌కుమార్‌లు అన్నదమ్ములు. కృష్ణ ఇల్లందలో, రాజ్‌కుమార్ వర్ధన్నపేటలో పాత ఇనుప సామాను కొట్టు నడుపుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కల్లెం విజయ్.. రాజ్‌కుమార్ వద్ద పని కుదిరి ఇల్లందలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో కృష్ణ కూతురితో ప్రేమలో పడ్డాడు. విషయం తెలుసుకున్న కృష్ణ.. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి రూ.50వేల జరిమానా సైతం వేసినట్లు తెలిసింది. తన కూతురిని ప్రేమించడాన్ని మనసులో పెట్టుకున్న కృష్ణ శుక్రవారం విజయ్ వర్ధన్నపేటలోని థియేటర్‌లో సినిమా చూస్తుండగా కత్తితో పొడిచినట్లు కుటుంబ సభ్యులు, స్నేహితులు చెప్పుకుంటున్నారు. సంఘటనా స్థలానికి వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్ చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, నిందితుడు ఊర కృష్ణ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



ల్యాబర్తిలో ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

రాయపర్తి (వర్ధన్నపేట): ఇసుక అక్రమ ఫిల్టర్లపై రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామ పరిధిలోని ఆకేరువాగులో ప్రాంతంలో ఇసుక ఫిల్టర్ చేస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న 6 ట్రాక్టర్లను అధికారులు సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్సై మాట్లాడుతూ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

సన్న బియ్యం పేరుతో మోసం

కాజీపేట: తక్కువ ధరలకే సన్నబియ్యం విక్రయిస్తామంటూ కొంతమంది వ్యక్తులు రేషన్ బియ్యం అంటగట్టి పలువురి నుంచి డబ్బులు కాజేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ టాటా ఏస్ వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బీపీటీ సన్న రకం బియ్యం అంటూ 25 కిలోల బస్తాను చూపిస్తూ బియ్యాన్ని విక్రయించారు. సాధారణంగా మార్కెట్‌లో 25కిలోల సన్న బియ్యం బస్తా ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,500వరకు ఉంది. కానీ సదరు వ్యక్తులు రూ.1,000కే విక్రయించడంతో తక్కువ ధరకు వస్తుందని పలువురు ఎగబడి కొన్నారు. వారికి అనుమానం రాకుండా బియ్యం బస్తా పైభాగంలో ఉన్న బియ్యాన్ని చూపించి బురిడీ కొట్టించారు. తమ సెల్‌ఫోన్ నంబర్లను సైతం ఇచ్చి వారిని నమ్మించారు. బాధితులు ఇంట్లో బియ్యం బస్తా విప్పి చూడగా అందులోని పైభాగంలో మాత్రమే కొంతమేర సన్న బియ్యం ఉండగా కింద భాగమంతా రేషన్ బియ్యం ఉండడం చూసి కంగుతిన్నారు. దీంతో వారు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లకు కాల్ చేయగా.. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఆవేదనకు గురై చేసేదిలేక మిన్నకుండిపోయారు.

'జెన్‌కో' అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించే టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గీసుకొండ: గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక మాస్టర్‌జీ పాఠశాలకు వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తి(38) హత్యకు గురయ్యాడు. గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. జాన్‌పాకలో బలగాని అనిల్ ఇంటి నిర్మాణం పనులను చేపడుతున్నాడు. ఇందులో భాగంగా ఇంటి ఎదుట ఇసుక కుప్పను పోసుకున్నాడు. అడ్డా కూలీగా ఉన్న ఓ వ్యక్తి ఇంటి పని నిమిత్తం వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బలగాల అనిల్‌కు ఇసుక కుప్పలో కూలీ మృతదేహం కనపడటంతో పోలీసులకు సమాచారం అందించాడు. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి రాయితో తలపై మోది హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గీసుకొండ సీఐ బాబూలాల్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85031, 87126 85240 సెల్‌నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. మృతుడి వివరాలు తెలిస్తే అతడిని హత్య చేసింది ఎవరో తెలుసుకోవచ్చని సీఐ తెలిపారు.

ఏడు దీవుల లక్నవరం

ఆహ్లాదాన్ని పంచుతున్న సరస్సు, పరిసరాలు

- పర్యాటకులకు అందుబాటులో మూడు దీవులు
- మిగతా దీవులపై కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- అటవీ శాఖ ఉద్యానవనంలో జింకలు, చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు
- దృష్టి సారిస్తే టూరిజం సెంట్రల్ పాయింట్‌గా గుర్తింపు



లక్నవరం వ్యూ (ఫైల్)

గోవిందరావుపేట: ప్రకృతి సహజసిద్ధ సోయగం.. ఏడుదీవుల వరం.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం. వరంగల్ - భూపాలపట్నం జాతీయ రహదారి 163 నుంచి బూస్సాపూర్ గ్రామం మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం సరస్సు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సమయంలో జంపన్నవాగులోకి లక్నవరం సరస్సు నీటినే వదులుతారు.

హరిత హోటళ్లు..

టూరిస్టులు ఉండటానికి సరస్సు మధ్యలో హరిత హోటళ్లు ఉన్నాయి. ప్రైవేట్ సదుపాయాలు కూడా ఉంటాయి. హరిత హోటళ్లలో డార్మిటరీ రూమ్స్ ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉంటాయి. గ్లాస్ రూమ్స్ కూడా ఉన్నాయి. ఈ గదుల వినియోగానికి ఒకరోజుకు రూ.2,000 నుంచి రూ.5,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉండడం వల్ల ఆన్‌లైన్ లో కూడా టికెట్స్ అందుబాటులో ఉంచారు. ఫుడ్ కోసం రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. లక్నవరంలో మూడు దీవుల్లో ప్రస్తుతం పర్యాటకులకు ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మిగతా దీవుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

మనసు దోచే ఊయల వంతెన..

లక్నవరం సరస్సు అందాలు చూడాలన్నా.. వర్ణించాలన్నా.. ఒక్కసారైనా పర్యటించాల్సిందే.. సరస్సు నీటిలో తేలియాడుతున్నట్లుగా ఊయల వంతెన పై నడుస్తూ చుట్టూ ఉన్న కొండలు, దీవులను చూస్తే కలిగే ఆనందం వర్ణనాతీతం. సరస్సులో బోటింగ్ చేస్తే వచ్చే హుషారే వేరంటారు.. పర్యాటకులు. కాకతీయ రాజులు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేసిన ఈ సరస్సు సుమారు 5వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం.. 10వేలు, అనధికారికంగా మరో పదివేల ఎకరాలకు పైగా సరస్సు నీటితో వ్యవసాయ సాగుజరుగుతోంది. ప్రస్తుతం సరస్సు అభివృద్ధిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. బ్రిడ్జి మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే గిరీశ్ భరద్వాజ్ డిజైన్ చేసిన ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రభుత్వం మరో బ్రిడ్జిని నిర్మించింది.

ఆదాయం, ఆహ్లాదం..

వివిధ ప్రాంతాల నుంచి లక్నవరం వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని, వన్య ప్రాణులను దగ్గర నుంచి చూసే అవకాశాన్ని కల్పించాలనే ఆలోచనతో అటవీ శాఖ అధికారులు చేసిన కార్యాచరణ అద్భుతం. 2019లో పునరావాస కేంద్రంతోపాటు అటవీ శాఖ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దుప్పుల పునరావాస కేంద్రం కింద అటవీ శాఖ అధికారులు 20దుప్పులు, జింకలకు పకడ్బందీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పునరావాస పునరుత్పత్తి ఏర్పాటు చేశారు. అందుకు అణుగుణంగా లక్నవరం తరలివచ్చే వేలాది మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ ఉద్యానవనం పేరుతో అద్భుతమైన పార్కును తీర్చిదిద్దారు. ఇందులో రూ.7.50లక్షల ఎంపీ నిధులతో చిల్డ్రన్స్ పార్కును సైతం ఏర్పాటు చేశారు. ఈ ఉద్యానవనం సందర్శించేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ఏర్పాటు చేసి ఆ నిధులతో మెయింటెన్స్ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.



అటవీశాఖ పర్యావరణ ఉద్యానవనం



అడవిలో నుంచి లక్నవరం సరస్సుకు దారి

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- రక్షణతోపాటు ఉద్యోగం కల్పిస్తాం
- పదహారు చింతల్ తండా బాధితులకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ

చెన్నారావుపేట: తల్లి దండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభయమిచ్చారు. ఈ మేరకు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన శ్రీనివాస్, సుగుణ దంపతుల పిల్లలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హంతకుడు నాగరాజుకు శిక్ష పడేలా చూస్తానని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధలైన పిల్లలకు ప్రభుత్వం తరఫున ఖర్చుల నిమిత్తం రూ.4.25లక్షలు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామని తెలిపారు. పిల్లల చదువులు, వారి రక్షణకు ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా బంధువులు, గ్రామస్తులు నిందితుడిని ఉరి తీయాలని, తనకు ఉద్యోగం ఇప్పించాలని బాధితురాలు దీపిక ఎమ్మెల్యే మాధవరెడ్డిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపెల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఈ భయానక ఘటన నుంచి తండా ప్రజలు ఇంకా తేరుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్, జనగామ ఎస్సై రాజేష్‌కుమార్‌లు రేయింబవళ్లు తండాలో పికెటింగ్, బందోబస్త్ ఏర్పాటు చేశారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని పడమటి కేశ్వాపూర్ గ్రామానికి చెందిన గిద్దెల గణేశ్ (20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గిద్దెల మేఘమాల, బాలయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో గణేశ్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు, కుటుంబ సభ్యులు వెతకగా సమీప వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కన్పించాడు. దీంతో గణేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలం వద్దకు ఎస్సై సతీష్‌కుమార్ చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బస్సు ఢీ: 15 మందికి గాయాలు



ప్రమాదస్థలంలో బస్సు, లారీ

ములుగు రూరల్: ములుగు జిల్లా పందికుంట –మల్లంపల్లి మధ్యలో శుక్రవారం ఉదయం లారీ, బస్సు ఢీ కొన్న ఘటనలో 15మంది గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. ములుగు నుంచి హనుమకొండకు ఆర్టీసీ అద్దె బస్సు 33మంది ప్రయాణికులతో వెళ్తున్న క్రమంలో హనుమకొండ వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 15మంది ప్రయాణికులు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. గాయాలైన వారిని అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒకరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారు ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ బోయపల్లి మహేశ్‌పై ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ విజయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా వన్‌వే ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పందికుంట వద్ద లారీ డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో బస్సును ఢీ కొట్టాడు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగలేదని అన్నారు. గాయపడిన వారిని ఆర్‌ఎం ములుగు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ రీజనల్ మేనేజన్ భాను కిరణ్, వరంగల్ డీఎంలు సురేష్, మోహన్‌రావు, ఎస్టీఐ కుమార్ తదితరులు ఉన్నారు.

పనిచేసే అధికారులే ఏజెన్సీకి రావాలి

- ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క
- రైతు భరోసా అందించాలని అధికంగా వినతులు



ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ

కొత్తగూడ: పని చేయాలనే సంకల్పం ఉన్న అధికారులే ఏజెన్సీ గ్రామాలకు రావాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మానుకోట జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్(గ్రీవెన్స్)లో ఆమె మాట్లాడారు. కొత్తగూడ, గంగారం, గూడూరు, మహబూబాబాద్, బయ్యారం మండలాల ప్రజలు మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. ఎక్కువగా రైతు భరోసా డబ్బులు అందించాలని వినతులు అందించారు. మండలంలో రికార్డుల ప్రక్షాళన సమయంలో ఫారెస్టు అధికారుల వల్ల పట్టాలు రద్దయ్యాయని, సర్వేలో రెవెన్యూ భూమి అని తేలినా హక్కు పత్రాలు ఇవ్వలేదని పలువురు వినతిపత్రం అందజేశారు. వెంటనే పట్టాలు జారీ అయ్యేలా చూడాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మంత్రి సూచించారు. గంగారం, కొత్తగూడ మండలాల్లో కొత్తగా పోడు జరగకుండా, సాగులో ఉన్న పాత భూముల్లో వ్యవసాయానికి ఆటంకం లేకుండా చూడాలని జిల్లా ఫారెస్ట్ అధికారి బత్తుల విశాల్‌కు సూచించారు. గూడూరు మండలంలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాలకు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని బాధితులు వినతిపత్రం అందించగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

స్టేజి దిగివచ్చి..

బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వట్టం సైదమ్మ వినతిపత్రం ఇచ్చేందుకు ఇబ్బంది పడుతూ రావడం చూసిన మంత్రి సీతక్క స్టేజి దిగి ఆమె వద్దకు వెళ్లి వినతి పత్రం తీసుకున్నారు.

శభాష్ పోలీస్..



చంటిపాపను లాలిస్తున్న మహిళా పోలీస్

మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన ఓ దివ్యాంగురాలిని మహిళా పోలీసులు ఎత్తుకుని తీసుకెళ్లారు. అలాగే వినతిపత్రం ఇవ్వడానికి చంటిపిల్లతో ఓ తల్లి వచ్చింది. ఈక్రమంలో ఆమె వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా.. పాపను ఓ కానిస్టేబుల్ ఎత్తుకుని లాలించింది.

యువతను చైతన్యం చేయాలి..

యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చైతన్యం చేయాలని అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీతక్క సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వేలుబెల్లి సమీపంలోని కత్తెర్ల వాగుపై నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాంనాథ్ కేకన్, ఏటూరు నాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర, ట్రాన్స్ కో ఎస్‌ఈ నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ర్యాగింగ్

భరించలేక తప్పించుకున్న 19 మంది పిల్లలు

- ఐదు కిలోమీటర్ల దూరంలోని పాత ఎంజేపీకి రాక
- హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్, టీచర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జనగామ: సీనియర్, జూనియర్ విద్యార్థుల ర్యాగింగ్.. గెస్ట్ టీచర్ల వెటకారం మాటలు.. చీటికి మాటికి ఫిర్యాదులతో విసిగిపోయిన 19 మంది విద్యార్థులు గోడదూకి తప్పించుకున్న ఘటన పెంబర్తి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో శుక్రవారం జరిగింది. బాధిత విద్యార్థులు బాలాజీ, టి.సాత్విక్, వి.సకిరానందన్, ఎం.భరత్, బి.విఘ్నేష్, కార్తీక్, వినయ్, ఎం.రామ్‌చరణ్, ఎస్.శ్రీచరణ్, టి.విగ్నేష్, సీహెచ్.రామ్‌చరణ్, రుషి, హవీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ రైల్వేట్రాక్ ఏరియాలోని బాలుర ఎంజేపీలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో 154 మంది(8, 9వ తరగతి)ని పెంబర్తి ఎంజేపీ(బచ్చన్నపేటకు చెందిన)లో 20 రోజుల క్రితం చేర్పించారు. ఇక్కడి సీనియర్, జూనియర్ విద్యార్థులు ఇటీవల వచ్చిన పిల్లలను ర్యాగింగ్ చేస్తున్నారు. వాటర్ సంప్‌లో అపరిశుభ్రత వాతావరణం కలిగేలా చేయడంతో వద్దని జనగామ నుంచి వెళ్లిన విద్యార్థులు వారించగా.. వారిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. సంప్ వాటర్ అపరిశుభ్రం కావడంతో పైపులైన్ వద్ద బకెట్లతో నీరు తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నామని బాధిత విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు సైతం ప్రేయర్‌లో జనగామ బాయ్స్ బ్యాడ్ అనేలా వ్యవహరించారని కన్నీటి పర్యంతమయ్యారు. గెస్ట్ టీచర్లు బూతులు మాట్లాడుతూ అవహేళన చేశారని ఆరోపించారు. ఈ విషయమై కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోలేదని, ఏ సంఘటన జరిగినా తమను బాధ్యులను చేస్తున్నారని వాపోయారు. ఇక అక్కడ ఉండకూడదని నిర్ణయించుకుని తెల్లవారుజామున గోడదూకి కాలినడకన సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామ పాత ఎంజేపీకి వచ్చేసినట్లు వివరించారు. పెంబర్తి గురుకులంలో భోజనం, కూర, చారు కూడా నాణ్యత లేక ఒక్క పూట కూడా తినలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పిల్లలు పారిపోయారని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు గురుకులం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను కొత్తగా వచ్చాను..



పెంబర్తి ఎంజేపీకి ఇటీవలే వచ్చాను. జూన్‌లో 154 మంది పిల్లలు జనగామ నుంచి వచ్చారు. గొడవలు జరిగే విషయం నాకు తెలియదు. అయినా రోజూ నిఘా ఉంటుంది. నైట్ వాచ్‌మన్ పర్యవేక్షిస్తారు. పిల్లలు ప్లాన్ చేసిన సంగతి పసిగట్టలేక పోయాం. ర్యాగింగ్‌పై విచారణ చేయిస్తాం. అటువంటిది జరగలేదని అనుకుంటున్నాం. పై అధికారులకు సమాచారం ఇచ్చాం.

- చంద్రమౌళి, పెంబర్తి ఎంజేపీ ప్రిన్సిపాల్

రిమాండ్‌కు తరలించకపోతే తడాఖా చూపిస్తాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

నల్లబెల్లి: అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేసిన శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ జితేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బందిని 24 గంటలలోపు ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించకపోతే మా తడాఖా చూపిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో శుక్రవారం ఎస్సై శ్రీను కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పరామర్శించింది. శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. సీఐ, సిబ్బంది వేధింపులు, అవమానాలు భరించలేక ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారంటే పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని, ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలని వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నూనవత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, బనావత్ రాంబాబు, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, నాయకులు చంద్రమౌళి, వైనాల అశోక్, గుండాల రాజకొరయ్య, వడ్లూరి రమేష్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్, మేడ రంజిత్, గాదపాక రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల హెచ్చరిక

- బొగత వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు



పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి బొగత జలపాతం వద్ద ప్రమాదాలకు ఎవరూ ఇబ్బందులు పడొద్దని పోలీసుల హెచ్చరిక పేరుతో శుక్రవారం పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. జలపాతంలో మొసళ్లు ఉన్నాయని, హద్దు మీరకండి..అయిన వాళ్లకు దూరం కాకండి.. అని ఫ్లెక్సీల్లో రాశారు.

క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ మీట్



విజేతలను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి

కాజీపేట అర్బన్ : క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో నిర్వహిస్తున్న తెలంగాణ, ఏపీ రీజినల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ విభాగంలో అండర్-14 విభాగంలో బాయ్స్ అండ్ గర్ల్స్ కేవీ వాల్తేరు ప్రథమ స్థానంలో నిలిచారు, అండర్-17 విభాగంలో కేవీ వాల్తేరు బాలికలు, కేవీ తిరుపతి బాలురు ప్రథమ స్థానంలో, అండర్-19 విభాగంలో కేవీ విశాఖపట్నం బాలికలు, ఒంగోలు బాలురు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వరంగల్ విద్యార్థులు కె.అనంతశ్రీ, పి.శ్రీజ, సిహెచ్.సూర్య, కె.కోదండరామ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజేతలను, జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుభాషిణి అభినందించారు. కార్యక్రమంలో కేవీ పీఈడీ కొర్ర శ్రీనివాస్, హైదరాబాద్ రీజియన్ పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.